## మెట్రోరైలు నిర్వహణలో

# అవాంతరాలుండొద్దు

- వర్షాకాలంలో నిరంతరాయంగా సేవలందించాలి
- హైదరాబాద్ మెట్రోరైలు ఎండీ ఎన్వీఎస్ రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎన్వీఎస్ రెడ్డి

హైదరాబాద్ సిటీ, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): నగర రవాణాలో కీలకమైన మెట్రోరైలు నిర్వహణలో వర్షాకాలంలోనూ ఎలాంటి అవాంతరాలూ ఉండొద్దని హైదరాబాద్ మెట్రోరైలు ఎండీ ఎన్వీఎస్ రెడ్డి అధికారులకు సూచించారు. వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో 24/7 విధులు నిర్వర్తించి, ప్రయాణికులకు మెరుగైన రవాణా అందించాలని ఆదేశించారు. వర్షాకాల పనుల సన్నద్ధతపై గురువారం రసూల్‌పురాలోని మెట్రోరైలు భవన్‌లో ఎల్‌అండ్‌టీ ఆపరేషన్స్, మెయింటెనెన్స్ కంపెనీ కియోలిస్, హెచ్‌ఎంఆర్‌ఎల్ ఇండిపెండెంట్ ఇంజనీర్, ఏఈసీఓఎం సీనియర్ అధికారులతో మెట్రో ఎండీ ఎన్వీఎస్ రెడ్డి సమీక్ష నిర్వహించారు. ఎల్‌అండ్‌టీ ఎండీ కేవీబీ రెడ్డి, కియోలిస్ ఎండీ ఎస్సీ మిశ్రా, హెచ్‌ఎంఆర్‌ఎల్, ఎల్‌అండ్‌టీ, కియోలిస్, ఏఈసీఓఎం సీనియర్ ఇంజనీర్లు పాల్గొన్నారు. భారీ వర్షాలు కురిసిన సమయంలో సీనియర్ ఇంజనీర్లందరూ అత్యంత అప్రమత్తంగా ఉండాలని, మెట్రోరైలు కార్యకలాపాలు, ఇన్‌స్టలేషన్ పనులను 24/7 పర్యవేక్షించాలని సూచించారు. సమీక్షలోని ముఖ్యాంశాలు ఇలా ఉన్నాయి.

- భారీ వర్షాలు, ఈదురుగాలుల సమయంలో ట్రాన్స్‌కో ఫీడర్ ట్రిప్ అయితే వెంటనే ప్రత్యామ్నాయ ఎలక్ట్రిక్ ఫీడర్లకు మార్చేందుకు ఏర్పాట్లు చేయాలి.
- కారిడార్లలోని విస్తరణ జాయింట్లను క్షుణ్ణంగా తనిఖీ చేయాలి. వర్షపు నీటి పైపులను శుభ్రపరచాలి. వర్షపు నీటి గట్టర్ లీకేజీలను నివారించేందుకు జాయింట్ల సీలింగ్ పరిశీలించాలి. వయాడక్ట్‌పై

మిగతా 8వ పేజీలో..

# మెట్రోరైలు నిర్వహణలో అవాంతరాలుండొద్దు

(5వ పేజీ తరువాయి)

పెరిగిన చెట్టుకొమ్మలను తొలగించాలి.

- మెట్రో వయాడక్ట్ పక్కనే ఉన్న చెట్లను క్రమం తప్పకుండా కత్తిరించాలి. ప్లాట్ ఫాంలపై నీరు నిలిచిపోకుండా ఎప్పటికప్పుడు తొలగించేందుకు హౌస్‌కీపింగ్ సిబ్బందిని అదనంగా నియమించాలి.
- మెట్రో వయాడక్ట్ సమీపంలోని ప్రకటన బోర్డుల నుంచి ఫ్లెక్సీలను తొలగించాలి. విద్యుత్ అమరికలపై వదులుగా ఉండేటట్లు బోల్ట్‌లను బిగించాలి. ఈదురుగాలుల కారణంగా స్టేషన్ పైకప్పు షీట్లు పడిపోకుండా ఉండేందుకు గట్టిగా బిగించాలి.
- మెట్రో ఎంట్రీ/ఎగ్జిట్ పాయింట్లు, లిఫ్టులు, ఎస్కలేటర్ల వద్ద నీరు నిల్వకుండా చూడాలి.
- రైలు ఎక్కుతున్నప్పుడు, దిగుతున్నప్పుడు ప్రయాణికులను అప్రమత్తం చేయాలి. ఇటీవల ఢిల్లీ మెట్రోరైలులో మహిళ చీర డోర్ల మధ్య ఇరుక్కుపోవడంతో ప్రమాదవశాత్తు ఆమె మరణించిందని గుర్తు చేశారు.
- రైళ్లలో ఎక్కేటప్పుడు, దిగేటప్పుడు మహిళలు, యువతులు చీర అంచులు, దుపట్టాలు, బ్యాగ్ పట్టీలతో జాగ్రత్తగా చూసుకోవాలి.